స్కెచ్

# భావి దేశోద్ధారకులు

యాముజాల శంకరం

"ఇవాళ పరీక్షటగా?" అన్నాడు రంగారావు.

"అనుకుంటున్నారంతా" అన్నా నేను.

ఏదో మావాడికి తెలియనట్టు వన్నేదో పరీక్షిద్దామనట్టూ మాట్లాడాడు. ఈ ప్రశ్న నేను పరీక్షకు పోతూవుంటే వేశాడు. ఇలాంటి రకం చాలామందిని చూశాను. మా శర్మకు ఇదివరకు పరీక్షలో ఎక్కువ మార్కులొచ్చాయని, ఈ తఫా చదవనందున తగ్గిపోతాయని, అలా తగ్గితే తన మర్యాదకే భంగకరమని మానివేశాడని వినికిడి. మరోమిత్రుడు పరీక్షకు వెళుతున్నానని ప్రొద్దున్నే ఇంట్లో చెప్పి, కాస్తో కూస్తో తడిరాల్చుకొని, బెజవాడలో (మాచవరం కాలేజీలో) పరీక్షయితే, ప్రొద్దున్నే గుంటూరు వెళ్ళి సాయంకాలం గాని తిరిగి ఇంటికి చేరుకోవడంలేదని, రాయిటర్ విలేఖరి భోగట్టా.

అసలు కొంతమంది చదవడమే గమ్మత్తుగా ఉంటుంది. మా రాజు చదవడు. "చదివితే మంచి బుర్ర. బాగా మార్కులు వస్తాయి" అంటారు. అందరినీ మించినవాడు మా సుబ్బులు. కష్టపడి ప్రొద్దస్తమానం, తెల్లవార్లూ, విసుగు విరామంలేకుండా చదవమంటే చదువుతాడు. శోచనీయమైన విషయమేమిటంటే బుర్రకెక్కదు. చస్తాడా! అలానే కుంటుతూ ఈడ్చుకొని వస్తున్నాడు బండిని. ఎప్పుడూ 35కు ఎక్కువగాని, తక్కువగాని రావు అయితే.

కొంతమంది కాలేజీకి చదివేందుకు రారేమో ననిపిస్తుంది. ఒక మిత్రుడు ప్రొద్దున్నే నాలుగు గంటలకు లేస్తాడు. దండాలు, బస్కీలు ఆరింటి దాకా తీస్తాడు. స్నానంచేసి, ఆపైన ఒక కోడిగుడ్డు. ఇంత బాదం రసం, నాలుగు ఇడ్లీలు రెండు పెసరట్లు, అర్థశేరు పాలు — నేను చెప్పేది అబద్ధంకాదు—ఇత్యాది కాలకృత్యాలతో సరిపోయేది సమయం కాస్తా. వాడికి కావలసింది కండబలం. ఏనాడూ పుస్తకం తీసిన పాపాన పోలేదు.

ఇహ మా రామ్మూర్తి క్లాసు పుస్తకాలు వదలేసి, మొత్తం ఎన్నిపత్రికలైతే వస్తున్నాయో వాటిని కొనో లేక ఎవరినైనా అడిగి తెచ్చుకొనో చదివి కాలక్షేపం చేసేవాడు. మా సత్యానికి కావలసింది సినిమాలు. వాటిలో పాటలు, వాటిని మళ్ళీ తను పాడడం. కొంచెం బాగా పాడతాడనుకోండి. వీటితో వీడి కాలక్షేపం. మరొకమిత్రుడు టీకు టాకుగా చక్కనిగుడ్డలు వేసుకొని (నలగకూడదు సుమండీ) వీధుల వెంట తిరగటం, వచ్చేపోయే విద్యార్థినులను గేలి చేయడం, వాళ్ళమీద లేనిపోనివి కల్పించి గప్పాలు కొట్టడంతో సరిపుచ్చుతాడు. ఇహ వాడికి సమయమేదీ చదువుకొనేందుకు? ఒక సోదరుడు పుస్తకం ముఖానికివేసుకొని పొద్దున్నే కూర్చునేవాడు. ఎప్పుడు హాస్టలు బెల్లు కొడతారా, ఎప్పుడన్నం తింటానా అనే ఆదుర్దాయే తప్ప చదివేవాడు కాదు.

మరి నా విషయం కొంచెం చెప్పవద్దూ. గర్వంతో పాడైనా. హైస్కూల్లో చదివేటప్పుడు నాకొక వెధవపేరు ఏడిచింది. "ఒక్కసారి చదివితే చాలు. బుర్రకెక్కి పోతుంది. అబ్బో శంకరానికేం" అన్నారు. ఆ ధీమాతో చదవడం మానివేశా. పరీక్షల్లో ఆరాత్రి చదివి ముక్కుమీద పెట్టుకొని తెల్లవారి కక్కేయటం, అలా చేశా. మూడుసార్లు స్కూలుఫైనలు పోయి అధోగతిపాలై, మెట్రిక్యులేషన్ శరణు జొచ్చి, ఇట్లా చేరా. అయితే రంగారావు ఇందులో ఏ రకానికి చెందినవాడా? అన్న సందేహం ఏర్పడింది పరీక్ష వ్రాస్తున్న నాకు.

శోచనీయమైన విషయమే. క్రింద బల్లమీద పరీక్ష పేపరు, చేతిలో కలం, ఇలా నాబుర్రలో ఆలోచనలు. ఛీ! ఏమిటిది? వ్రాయాలి. అవును

వ్రాయాలి! కలం కదలందే! ఎలా కదులుతుంది? అసలు చదవందే. వెధవ హిందీ. ఈ బీకాం వాళ్ళకు హిందీ తప్పదాయె. ఒక్క సంవత్సరంలో భాషంతా నేర్చుకొని, గ్రామరు తప్పులు లేకుండా, వాక్యం సరిగా వ్రాసి మార్కులు తెచ్చుకోవాలి. ఎట్లా? పుట్టినదగ్గరినుండి చదువుతున్న ఇంగ్లీషులోనే ఒక్క వాక్యం సరిగా వ్రాయడం చేతకాదే! ఏదో తెలుగైతే ఎలాగైనా చద్దును.

చిన్నప్పుడు ఇంటిదగ్గర చదవకపోతే వీపు బద్దలయ్యేది. మరిప్పుడు? కావలసినంత డబ్బు- ఎట్లా పంపిస్తే నాకెందుకు - వస్తోందా లేదా? ముత్యాల్లాంటి స్నేహితులు. ముచ్చటైన కాఫీ హోటళ్లు. కులాసాకి పేకాటలు. బలానికి ఆటలు. వినోదానికి సినిమాలు.

అమ్మయ్యా! ఒక గంట కాలం గడచిపోయింది. ఇంకా రెండు గంటలు కూర్చోవాలి. లేచిపోతే? అరగంట కాకుండా పోవడంలో మా వాళ్లు అగ్రగణ్యులు. లేవబోయాను. అరె, ఈ వెధవ చిన్నరూములో ఉన్న పదిమంది తలెత్తకుండా వ్రాస్తున్నారే? ఇంకా ఒక్కడూ పోలేదాయె! నేను పోతే ఎలా?

ఫ్యాన్ మంచిరీళ్ళు తెచ్చాడు. కాఫీ తెప్పించుకొని త్రాగుదామనిపించింది. ఎవరికీ ఆ అలవాటే లేదిక్కడ. నేను తెప్పించుకుని త్రాగితే మృగంలా చూడరూ? ఆ మంచితీర్థమే ఇంత పుచ్చుకున్నా.

కిటికీలోంచి బయటకు చూచా. పెద్ద షెడ్డు, దాని వెనుక క్రికెట్ గ్రౌండు, అపైన కాలువ, ఇంకా పైన రైలు పోతోంది. షెడ్డు మూడు గదుల్లోను విద్యార్థులు మహదర్జాగా వ్రాసేస్తున్నారు. ఓ కథ రాద్దామా అనిపించింది. వాళ్లిచ్చిన తెల్లకాగితాలు, నా కలం, అన్నీ సిద్ధంగా ఉన్నాయిగా.





అద్భుతమైన ఈ పెప్స్‌ను
వైద్యులు ఈ క్రిందివాటి
నివారణకు సిఫారసు
చేస్తారు.

దగ్గులు, జలుబులు, కుదపు, గొంతు పుండు, ఇన్‌ఫ్లుయెంజా, బ్రోంకైటిస్, మరియు రొమ్ము, శ్వాసకోశ సంబంధమైన ఇతర బాధలు.

**PEPS**

దగ్గు మూలంగా మీ గుండెకు, శ్వాసకోశాలకు బాధ కలుగుతుంది. దగ్గును పెప్స్‌బిళ్లలు వెంటనే నివారిస్తాయి. పెప్స్‌ను మీరు చప్పరించునపుడు, శ్వాసతోపాటు మనోహరమైన, ఔషధప్రాయమైన దీని సారం మీ గొంతు, శ్వాసనాళాల ద్వారా శ్వాసకోశాలలో ప్రవేశిస్తుంది. రొమ్ము, గొంతు బాధను కూడా పెప్స్ ఉపశమింపజేస్తుంది. ప్రమాదకరమైన క్రిములను పెప్స్ సంహరిస్తుంది. శ్వాసనాళాల సంబంధమైన బాధలను పెప్స్ నిర్మూలిస్తుంది. బిళ్లలు బాధను నివారించి, గుండెను, శ్వాసకోశాన్ని దృఢపరుస్తాయి. పెప్స్ బిళ్లలు అద్భుతమైనవి.

పెప్స్ ఆంటీసెప్టిక్ గొంతు, రొమ్ము బిళ్లలు

వెనుకనుంచి "వహ్ జాతా హై. అంటే, దానికి ఇంగ్లీషు ఏమిటండి" అన్నాడు గుస గుసగా నా సోదరుడు. "అది తెలిస్తే ఇంకేం" అన్నా. ఆ చివర బెంచీలో శ్రీహరి కాపీ ఘుమా క్రింద కొట్టేస్తున్నాడు. శేషగిరి పక్కవాడి దాంట్లో చూచి వ్రాసేస్తున్నాడు. వాచరు పరీక్షాపత్రాన్ని తనిఖీ చేస్తున్నాడు.

ఇటు చూచా, కొండ, కొండక్రింద రెండు హోటళ్లు, రెండు కిళ్ళీకొట్లు, సిమెంటు రోడ్డు, దానిమీద పోతూ కార్లూ, జనం. ఎంతసేపిలా, నెంబరు వేశా. ఇచ్చేద్దామనుకున్నా. మళ్లా తట పటాయించాను.

నిన్న నాల్గవ బీకాం మిత్రుడన్న మాట గుర్తొచ్చింది. "మాకు ఇంకా రెండు నెల అన్నా లేవు, మీకు సంవత్సరంపైన ఉంది. కష్ట పడి చదవండి. మాకు గడచిపోయింది కాలం" అన్నాడు.

"మీకు గడచిపోయింది. మాకు గడచి పోబోతోంది" అన్నాడు సుబ్బులు. ఈ సల హాలకేం, నేనెన్నిసార్లివ్వలా? ఇవ్వటం మట్టుకే. పాటించటం మాట దేముడెరుగు. అందాకా ఎందుకు, మా హిందీ పండితుడు, "పరిశ్రమ చేయుండోయ్! పరిశ్రమ" అని రోజూ ఘోషించే వాడు కాదు. ఎంత చదివితే మాత్రం ప్యాసయ్యే సుడి ఉండవద్దూ?

వాచర్ని చూచా. పాపం! ఆయన పరీక్షా పత్రాన్ని పదిహేనుసార్లు అటు, ఇటు త్రిప్పి చూచాడు. అటు కొండకేసి, ఇటు కాల్వకేసి చూస్తూ కుర్చీలోంచి లేచేవాడు కాదు. ఎంత సందిచ్చేవాడనుకున్నారు? కాని మాకు పుస్తక మిచ్చి కాపీ కొట్టమన్నా, ఎక్కడుందో ఎన్నో పారమో తెలిస్తేగా!

ఏమైనా కాని అని లేచా. అంతా తల లోంచి వ్రాయడం లేదు, ఆలోచిస్తున్నారు. చప్పుడికాకుండా పేపరిచ్చి వెళ్లిపోదామను కున్నా. వెధవచెప్పులు కొత్తవేమో కిర్రుకిర్రు మనటంతో అంతా నావంక చూచారు. పేప రిచ్చి ధీమాగా బయటకు వచ్చేశా. బయట యెవరో,

"ఎన్ని మార్కులొస్తాయి" అన్నారు.

"ఓ యాభై" అన్నాను.

# నవోషస్సు

సమరోన్మాద తమస్సులు
  సకల దిశావళి నటించె
సమతామోద-ఉషస్సుల
లేగొంతుల కురి బిగించె
ఈ గాఢ తమస్సులలో
రేగిన సమరోన్మాదం
దానవత్వ దావాగ్నుల
రాల్చును రక్త హవిస్సుల
ఈ గూఢ-ఉషస్సులలో
దాగిన సమతామోదం
మానవత్వమున జిలుకును
మధుర సుధాపాథస్సుల
తూర్పున రాగజ్యోతులు
తొందరపడి తలలెత్తెను
బెదరిన చీకటి గూబల
పిరికి గుండె లలపెత్తెను
వెలసిన రాగజ్యోతుల
విచ్చెను అరుణోదయమ్ము
విచ్చిన వెచ్చని కాంతుల
వీడెను చీకటి భయమ్ము
సుప్త మానవత్వ శిశువు
ఆప్తులలో అడుగువేసె
తప్తదానవత్వ పశువు
దీప్తులలో కన్నుమూసె
సమరోన్మాదం నశించె
సమతామోదం లసించె
మానవత్వమే రసించె
మానవత్వమే హసించె

— సి. నారాయణరెడ్డి